

### సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు
- రుద్రంపూర్ ఐటీఐ కళాశాలకు పరికరాలు, బెడ్లు, కుర్చీల బహూకరణ

6



## కాలం కలిసొస్తే.. జూలైలోనే సాగునీరు

- సాగర్ ఆయకట్టుకు గతం కంటే ముందుగానే నీరందుతుందని అంచనా
- ఎన్నెస్పీ కాలువ బుష్ కటింగ్‌కు రూ.కోటి మంజూరు
- సీతారామ లింక్ కెనాల్‌కు టెండర్ల ప్రక్రియ పూర్తి
- డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు త్వరలో టెండర్లు
- 'ఆంధ్రజ్యోతి'తో నీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు



ఇంటర్వ్యూ...

ఖమ్మం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏటా జిల్లాలోని సాగర్ ఆయకట్టు భూములకు ఆగస్టులో నీటి విడుదల ఉంటుందని, కానీ ఈ సారి కాలం కలిసొస్తే జూలైలోనే నీరందే అవకాశాలు మెండుగా ఉన్నాయని నీటిపారుదల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కృష్ణా నదికి వస్తున్న వరద, జిల్లాలోని సాగర్ ఆయకట్టు నీటి విడుదల అవకాశాలు, కాలువల మరమ్మతులతో పాటు సీతారామ పాలేరు లింక్‌కెనాల్ పనులు కూడా సకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

**ఆంధ్రజ్యోతి:** సాగర్ ఆయకట్టుకు ఈ ఏడాది నీటి విడుదల పరిస్థితేంటి?

**ఎస్ఈ:** జిల్లాలో సాగర్ ఆయకట్టుతోపాటు ఎత్తిపోతల పథకాలు, చెరువులు, చెక్‌డ్యాంల కింద సుమారు 4.60లక్షల ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి.అయితే ప్రతి సారి ఆగస్టులోనే సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదలవుతుంది. అయితే ప్రస్తుతం కృష్ణా ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతుంది. నాగార్జునసాగర్ 590 అడుగులకు గాను ప్రస్తుతం 514 అడుగుల నీటి మట్టం ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కృష్ణా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో ముందుగానే నీరు చేరుతుంది. మున్ముందు కూడా వర్షాలు సమృద్ధిగా పడితే సాగర్ ఎడమకాలవ కింద కూడా జూలైలోనే నీరు విడుదల చేసే అవకాశం ఉంటుంది.

**ఆంధ్రజ్యోతి:** ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల్లో నీటి మట్టాల పరిస్థితి?

**ఎస్ఈ:** ఆల్మట్టిలో 1,705 అడుగులకుగాను 1,694అడుగులు, నారాయణపూర్‌లో 1,615 అడుగులకుగాను 1,609 అడుగులు, ఉజ్జయిని 1,630కి 1,625.28అడుగులు, తుంగభద్రలో 1,633కు గాను 1616.85అడుగులు, శ్రీశైలంలో 885 అడుగులకు గాను 861 అడుగులు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 590 అడుగులకు గాను 514అడుగుల వద్ద నీటిమట్టం ఉంది. కృష్ణా పరివాహకంలో భారీవర్షాలు పడితే అన్ని ప్రాజెక్టుల్లో నీరు నిండుతుంది.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో సాగర్ కాలువలెలా (మిగతా 6వ పేజీలో)




పాత భవనాలు.. అధ్వానంగా ఉన్న ఆవరణలు.. సక్రమంగా లేని మరుగుదొడ్లు.. ఇదీ ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఇంటర్ కళాశాలల దుస్థితి. అటు పాలకులు.. ఇటు యంత్రాంగం పట్టింపులేక కళాశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆ ప్రభావం అడ్మిషన్లపై పడుతోంది. ఇన్ని అసౌకర్యాల మధ్య అడుగుపెట్టలేక.. వసతుల పరిస్థితే ఇలా ఉంటే తమ భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న భయంతో సర్కారు జూనియర్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు అనాసక్తి చూపుతున్నారు. అందుకు గతేడాదికి ఈ ఏడాదికి కాలేజీల్లో జరిగిన అడ్మిషన్ల సంఖ్యే నిదర్శనంగా కనిపిస్తోంది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ ఇంటర్ చదువులు చెబుతామంటున్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెంచేలా బడిబాట నిర్వహిస్తున్న క్రమంలో.. ఏటికేడు దిగజారుతున్న ఇంటర్ కళాశాలలను బలోపేతం చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పట్టింపులేక.. ప్రవేశాల్లేక!

- ఏటికేడు దిగజారుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి
- అసౌకర్యాల మధ్య అడుగుపెట్టేందుకు విద్యార్థుల అనాసక్తి
- సర్కారులో ఇంటర్ చదువుకు వెనకాడుతున్న వైనం
- గతేడాది ఖమ్మం జిల్లాలో 21 కళాశాలల్లో 2,365 అడ్మిషన్లు..
- ఈ ఏడాది నేటికి 2,369 మంది చేరిక
- ప్రవేశాల పెంపుపై దృష్టి పెట్టని అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి రోజు రోజుకు అధ్వానంగా మారుతోంది. కొన్ని చోట్ల పాత భవనాలు.. మరికొన్ని చోట్ల అసౌకర్యాల కారణంగా విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపటంలేదని తెలుస్తోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటికేడు పెరుగుతుండగా.. సర్కారీ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య మాత్రం తగ్గుతూ వస్తుండటం ఆందోళనకరమైన అంశంగా చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే.. మున్ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలల మనుగడ కష్టంగా మారి.. పేద విద్యార్థులకు భారంగా పరిణమించే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆయా కళాశాలల్లో అడ్మిషన్లను పెంచేందుకు అధికారులు కృషి చేయకపోవడం, వేసవి సెలవుల్లో కళాశాలలో సౌకర్యాల కల్పన గురించి ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడం లాంటి వాటి వల్లే ప్రభుత్వ జూనియర్ విద్యపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిచూపడం లేదన్న విషయం అర్థమవుతోంది.

ఈ నేపథ్యంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లలో చతికిలపడ్డాయని లెక్కలు చెబుతున్నాయి. ఇక ఈ విద్యాసంవత్సరంలో ఖమ్మం నగరంలోని ఒకటి, రెండు జూనియర్ కళాశాలలు మినహా జిల్లాలోని మిగిలిన అన్ని కళాశాలల్లో నమోదైన అడ్మిషన్లు తక్కువని సమాచారం. ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు, సిబ్బంది కేవలం ఆఫీసు కార్యకలాపాలకే పరిమితమవుతున్నారు తప్ప.. కళాశాలల్లో అడ్మిషన్లు పెంచుకునేందుకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదని, అడ్మిషన్లు జరిగే కీలక సమయంలో అధ్యాపకులకు వివిధ రకాల పనులను అప్పగిస్తుండటంతో వారు అడ్మిషన్ల సంగతే మరిచిపోతున్నారని తెలుస్తోంది. కేవలం కళాశాలకు వచ్చిన అడ్మిషన్లను మాత్రమే తీసుకుంటుండటంతో ఈ గడ్డు పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలున్నాయి.

**మూడు సంవత్సరాలుగా అడ్మిషన్లు ఇలా..**

2023-24లో ఖమ్మం జిల్లాలోని 19ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు అంతంత మాత్రంగా వచ్చాయి. అత్యధికంగా (మిగతా 6వ పేజీలో)

**సౌకర్యాలు లేకపోవడమూ కారణమే..**

ప్రభుత్వ పాఠశాలలతో పోల్చిస్తే జూనియర్ కళాశాలల్లో ఉచిత భోజనం, వసతితో పాటు సరైన సౌకర్యాలు లేకపోవటంతోనే తల్లితండ్రులు తను పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించకుండా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు.. లేదంటే గురుకులాల్లో చేరుస్తున్నారని, చాలామంది అమ్మాయిలను కేజీబీవీల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. పదో తరగతి పూర్తి కాగానే వివిధ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో డేస్కాలర్ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. గురుకులాల నుంచే ప్రభుత్వ కళాశాలలకు పోటీ ఎదురవుతున్నా వాటి బలోపేతంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2025-26 విద్యా సంవత్సరం నుంచి కేజీబీవీల్లో కూడా ఇంటర్ విద్యను అందిస్తుండటంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య తగ్గొచ్చనే వాదనలు వినపడుతున్నాయి. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు అంతగా రాలేదనే తెలుస్తోంది.

## ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు

- ఇళ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దు
- పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- త్వరలో ఏజెన్సీలో ఎత్తిపోతల పథకాలు, చెక్‌డ్యాంలు
- చర్ల పర్యటనలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

చర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చితీరుతామని, ఇళ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం చర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తెస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లతో పాటు ఇతర పథకాలను అందజేస్తామని గుర్తు చేశారు. భద్రాచలం ఏజెన్సీ వచ్చినప్పుడు ఇక్కడి పేదల ఇళ్లు చూస్తే చాలా బాధకలిగేదన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి ములుగు, పినపాక, భద్రాచలంలో పాదయాత్రకు వచ్చినప్పుడు ఇక్కడి పేదల పరిస్థితి చూసి నేడు అదనంగా ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. వైఎస్ఆర్ ఉన్నప్పుడు ఇంటికి లక్ష ఇచ్చామని, నేడు రూ.5లక్షల నగదు ఇస్తున్నామన్నారు. ఇళ్లు మంజూరైన పేదలు త్వరగా ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ఇల్లు మంజూరై, కట్టుకోలేని మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా నగదు అందజేస్తామన్నారు. ఇల్లు రాని వారు ఆందోళన చెందొద్దని, ప్రతీ ఒక్కరికీ ఇల్లు ఇస్తామన్నారు. ఏజెన్సీలో నిటి నిల్వలున్నాయని, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తామన్నారు. మొండి కుంట ప్రాజెక్టును కూడా పూర్తి చేసి, రెండు పంటలకు సాగు అందిస్తామన్నారు. అలాగే గత ప్రభుత్వం హయాంలో పేదలకు వరిగిందేమీ లేదని, పదేళ్లలో పూర్తిగా పేదలకు ఇళ్ల ఇవ్వలేదని, రాష్ట్ర వ్యాప్తంగా అరకొర ఇళ్ల ఇచ్చి గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇళ్ల లేని పేదలే కనిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఉచిత బస్, విద్యుత్ అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఇది పేదల ప్రభుత్వమని ఎలాంటి సమస్యలు వచ్చినా స్థానిక ఎమ్మెల్యే, లేదా ములుగు వచ్చి నాకు స్వయంగా ఫిర్యాదు చెయ్యొచ్చునన్నారు. అంతకు ముందు చర్ల లక్ష్మీకాలనీ గ్రామంలో 20లక్షలతో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని (మిగతా 6వ పేజీలో)



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న సీతక్క



రథం లాగుతున్న భక్తులు

7

## వైభవంగా జగన్నాథ రథయాత్ర

- పూజలు చేసి ప్రారంభించిన హెవీవాటర్ ప్లాంట్ జీఎం
- అశ్వాపురం గౌతమీనగర్‌లో కోలాహలం

## పోరాటం ఫలించింది.. ఉద్యోగం వచ్చింది

- రామకృష్ణ 18 ఏళ్ల నిరీక్షణకు తెర
- ప్రజా ప్రభుత్వంలో దక్కిన గౌరవం

కొత్తగూడెం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకం కింద చనిపోయిన తన తండ్రి ఉద్యోగాన్ని తనకు ఇవ్వాలంటూ కొత్తగూడేనికి చెందిన కర్నాటి రామకృష్ణ అనే వ్యక్తి చేసిన 18ఏళ్ల పోరాటం ఫలించింది. అధికారులు పట్టించుకోకపోవడం, కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో ఇన్నాళ్లు ఆయన ఆవేదనతో గడిపారు. చివరకు ప్రజాప్రభుత్వంలో తన ఉద్యోగ కల నెరవేరింది. దీనికి సంబంధించిన వివరాలివీ.. కొత్తగూడెం పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించే కర్నాటి నాగేశ్వరరావు 2007లో అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో నిబంధనల ప్రకారం ఆయన ఉద్యోగం అతడి కుమారుడైన అప్పటికి 21ఏళ్ల వయసున్న, దివ్యాంగుడైన.. రామకృష్ణకు రావాల్సి ఉంది. కానీ పలు కారణాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగం తనకు రాకపోవంతో రామకృష్ణ 2007లో హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం 2013 అక్టోబరు 1వ తేదీన రామకృష్ణకు అనుకూలంగా తీర్పునిస్తూ.. తండ్రి ఉద్యోగాన్ని రామకృష్ణకు ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో అధికారులు కోర్టు ధిక్కరణ చేశారంటూ ఆయన మరో మారు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2023 డిసెంబరు 10న నిర్వహించిన తొలి ప్రజాదర్బార్‌లో రామకృష్ణ తన దరఖాస్తును అందించాడు. అతడి విన్నపాన్ని స్వీకరించిన సీఎం కార్యాలయ అధికారులు.. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మంత్రి చూపిన చొరవతో రామకృష్ణను పంచాయతీరాజ్‌శాఖ కొత్తగూడెం డివిజనల్ ఆఫీస్ సబార్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఆ నియామక పత్రాలను గురువారం ఖమ్మం పంచాయతీరాజ్ ఎస్ఈ జి.వెంకటరెడ్డి రామకృష్ణకు అందజేశారు. దీంతో 18 సంవత్సరాలుగా తన తండ్రి ఉద్యోగం కోసం చేసిన పోరాటం ఫలించిందంటూ రామకృష్ణ, ఆయన కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తనకు ఉద్యోగం ఇప్పించేందుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ కమిషనర్‌గా పనిచేసిన లోకేష్‌కుమార్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.



పంచాయతీరాజ్ ఎస్ఈ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న రామకృష్ణ

## రైతులకు తోడుగా..

- విద్యుత్ అధికారుల పొలంబాట
- వానాకాలం సాగు సీజన్ రాకతో ముమ్మరంగా కార్యక్రమం
- ఖమ్మం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్
- ఇప్పటి వరకు 2,325 సమస్యలకు పరిష్కారం




పొలంబాట కార్యక్రమంలో డీఈ బాబురావు, ఏడీఈ సంజయ్‌కుమార్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో విద్యుత్ సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ రైతులకు తోడుగా నిలుస్తున్నారు విద్యుత్‌శాఖ అధికారులు. పొలంబాట కార్యక్రమం పేరుతో గతేడాది జూలై 28న ముదిగొండలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యాలయాలను వదిలి జిల్లా, డివిజన్ స్థాయిలోని అధికారులు వ్యవసాయ భూములకు వెళ్లి నేరుగా రైతులతో మాట్లాడుతున్నారు. ఒక వైపు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సూచనలు, అవగాహన కల్పిస్తూనే మరోవైపు వ్యవసాయ విద్యుత్ సమస్యలపై తక్షణ పరిష్కారం చూపుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంకేతిక, డిస్ట్రిబ్యూషన్, సేఫ్టీ అధికారులు బృందంగా ఏర్పడుతున్నారు. నేరుగా పొలాల్లోకి వెళ్లి ప్రమాదకరంగా (మిగతా 6వ పేజీలో)

### ఏజెన్సీ మణిహారం..

- యూనివర్సిటీ ర్యాంకులతో భద్రాద్రి డిగ్రీ కళాశాల ముందంజ
- మెరుగైన మౌలిక సదుపాయాలు

6

### సింగరేణిలో 9న దేశవ్యాప్త సమ్మె!

నోటీసు ఇచ్చిన ఏఐటీయూసీ నాయకులు

### సంస్థ అభివృద్ధికి గుర్తింపు కార్మిక సంఘం సహకరించాలి

ఏఐటీయూసీ నేతలతో సమావేశంలో డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు

7

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ పోటీలకు

# భద్రాద్రి క్రీడాకారులు

### 20 మంది పేర్లు ప్రకటించిన డీవైఎస్‌వో పరంధామిరెడ్డి



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్27(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చూపిన 20మంది బాల, బాలికల వివరాలను డీవైఎస్‌వో పరంధామిరెడ్డి శుక్రవారం ప్రకటించారు. జిల్లాలో ఎంపికైన వారు వచ్చే నెల జూలై 2న హైదారాబాద్ హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలకు హాజరుకావాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, అర్హత సాధించిన వారిని రాష్ట్రంలో ఉన్న మూడు రీజినల్ స్పోర్ట్స్ స్కూల్స్ హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో అడ్మిషన్స్ ఇవ్వబడుతాయని తెలిపారు.

**బాలుర విభాగంలో ఎంపికైన వారు...**

కె.వివేక్, టి.గణేష్(ఇల్లందు), ఎల్.మహాదేవ నాయక్, పి.సకిత్, ఎస్‌కె.యాకూబ్‌పాషా(చుంచుపల్లి), యం.మోహిత్ శ్రీకాక్య, జి.రిషికేష్(పాల్వంచ), ఏ.లోకేష్ (దమ్మపేట), జి.వేదాన్ష్ (టేకులపల్లి), పి.సహర్ష(గుండాల) ఉన్నారు.

**బాలికల విభాగంలో...**

కె.స్నేహిక(ఆళ్ళపల్లి), పి.శశిక(పాల్వంచ), ఎం.శ్రీభార్గవి, బి.ప్రాణికహాసిని(జూలూరుపాడు), ఓ.తరుణ్‌సాయి(అన్నపురెడ్డిపల్లి), కె.మోక్షిత రమ్య(పాల్వంచ), బి.వరుణ్(చుంచుపల్లి), ఏ.నేత్రిక (లక్ష్మీదేవిపల్లి), పి.దీక్షిక (ఆళ్ళపల్లి), ఎల్.రిత్విక్‌రాజ్(కొత్తగూడెం) ఉన్నారు.

# ఏజెన్సీ మణిహారం భద్రాద్రి డిగ్రీ కళాశాల

- యూనివర్సిటీ ర్యాంకులతో ముందంజ
- మెరుగైన మౌలిక సదుపాయాలు



భద్రాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఏజెన్సీ విద్యార్థులకు మణిహారంగా నిలుస్తోంది. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల వెలువడిన పీజీ ఫలితాల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించగా తాజాగా వెలువడిన డిగ్రీ ఫలితాల్లో మంచి గ్రేడింగ్‌లతో అత్యుత్తమ ఫలితాలను సాధించినట్టు కళాశాల అధికారులు వెల్లడించారు. కాగా ఇటీవల తాగునీటి కోసం వాటర్ కూలర్లను నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. ఐటీసీ భద్రాద్రి మహిళ సమితి సహకారంతో 30 అధునాతన వాష్‌రూమ్స్ రూపొందించడంతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ నేపథ్యంలో నూతన విద్యా సంవత్సరం ఆరంభమైన తరుణంలో డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి సైతం విద్యార్థులు అధిక సంఖ్యలో దోస్త్ ద్వారా ఇప్పటికే ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. రాబోయే మరో రెండు విడతల్లో మరింతగా విద్యార్థులు కళాశాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నట్టు కళాశాల అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడ లేనివిధంగా భద్రాచలం డిగ్రీ కళాశాలలోని దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఉచిత సేవలను అధ్యాపక బృందం అందిస్తుండటం విశేషం. ఈ విధంగా సుమారు 400 మంది విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాలకు సహకారం అందించారు.

**వర్సిటీ ర్యాంకులతో..**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల ప్రకటించిన పీజీ ఎంకామ్ ఫలితాల్లో కళాశాలకు చెందిన బానోతు ప్రనూష 2019-2021 విద్యా సంవత్సరానికి గాను రెండు బంగారు పతకాలను సాధించడం విశేషం. జూలై 7న ఆమెకు యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఈ రెండు బంగారు పతకాలను అందజేయనున్నారు. కాగా తాజాగా కేయూ ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో సైతం కళాశాల విద్యార్థులు అత్యధిక గ్రేడ్లు, ఉత్తీర్ణత శాతం సాధించారని కళాశాల అధికారులు తెలిపారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో కె.హరిహరన్ 8.75 జీపీఏ, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో ఎ.అరుణకుమారి 8.70, బీకామ్‌లో ఎస్కే.యాసీనా 8.41, బీఏలో బి.రోహిణి 7.9 గ్రేడింగ్ పాయింట్లను సాధించారు. ఇటీవల 2025 ఏపీ పీజీ సెట్‌లో కళాశాల విద్యార్థిని వి.లహరి సెరీకల్చర్‌లో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకును సాధించింది. అలాగే తెలుగు సబ్జెక్ట్‌లో జె.మాధురి రాష్ట్రస్థాయిలో 36వ ర్యాంకు సాధించడం విశేషం. ఈ విధంగా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు వన్నె తెచ్చారని కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, అన్నారు. ఈ సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

**స్వయం ప్రతిపత్తితో మరింతగా ఖ్యాతి**

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2024 జూలై 14న స్వయం ప్రతిపత్తి హోదాను కల్పిస్తూ అధికారిక ఉత్తర్వులను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జారీ చేయడంతో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఈ స్వయం ప్రతిపత్తితో కళాశాల ఖ్యాతి మరింతగా ఇనుమడించింది. ఏజెన్సీలో గత 45 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు ఉన్నతస్థాయిలో చదువులందిస్తున్న డిగ్రీ కళాశాలగా నిలుస్తోంది. స్వయం ప్రతిపత్తితో కళాశాలలో నూతన కోర్సులు ఏర్పాటుకు సైతం మార్గం సుగమం కావడంతో అందుకు అనుగుణంగా కళాశాల అధికారులు, అధ్యాపక బృందం చర్యలు చేపట్టాయి.

# జిల్లాలో బడిబాట భేష్

### వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమం జిల్లాలో సంతృప్తికరంగా నిర్వహిస్తున్నారని విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు కే.సత్యనారాయణరెడ్డి అభినందించారు. ఖమ్మంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బడిబాట ఓపెన్‌స్కూల్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఒకటో తరగతిలో విద్యార్థుల ప్రవేశాలు 33శాతం పెరిగాయని జిల్లా సీఎంవో యలగందుల రాజశేఖర్ వివరించారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ఎలాగైనా విద్యార్థుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో తగిన ప్రణాళికతో పనిచేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టామని జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ నేతృత్వంలో ఈ ఏడాది 14 స్కూల్స్ తిరిగి ప్రారంభించామని ఆయన తెలిపారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్‌లో కొత్తగా ఒక పాఠశాలను ప్రారంభించామన్నారు. ఈ 15పాఠశాలలకు వెంటనే మధ్యాహ్నం భోజనం అమలయ్యే విధంగా ఏజెన్సీలను నియమించామని, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, వర్క్ బుక్స్, లైబ్రరీ బుక్స్, యూనిఫామ్ వంటివి అందజేశామని సీఎంవో రాజశేఖర్ వివరించారు. జిల్లాకు సరఫరా అయిన అన్ని రకాల పుస్తకాలను నూరు శాతం పాఠశాలలకు సకాలంలో అందించామని ఆయన ఆర్జేడీకి వివరించారు. మండలాల వారీగా విద్యార్థులు నమోదును ఆర్జేడీ సమీక్షించారు. పాఠశాల వారీగా గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం విద్యార్థుల నమోదు తగ్గిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని, బడిబాట పూర్తయ్యేలో లోగా ఈ ఏడాది కచ్చితంగా విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా చూడాలని ఆర్జేడీ ఆదేశించారు. దివ్యాంగుల సర్వే, వారి నమోదు, భవిత కేంద్రాల పనితీరుపై ఆరా తీశారు. దివ్యాంగులకు తగిన అత్యధిక పరికరాలు అందించడంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని సీఎం రాజశేఖర్ తెలుపగా ఆర్జేడీ అభినందించారు. అనంతరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు జరుగుతున్న తీరుపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు సెంటర్లవారీగా విద్యార్థుల నమోదు, గతేడాది వార్షిక పరీక్షా ఫలితాల వివరాలను తెలిపారు. బయోసైన్స్ స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రభాకర్‌రెడ్డి జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ శిక్షణ వివరాలు తెలిపారు.

## గవర్నర్ దత్తత గ్రామాలను అభివృద్ధి చేయాలి

### ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్

భద్రాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గవర్న ర్ దత్తత తీసుకున్న గ్రామాలైన పూసుకుంట, గోగులపూడి గ్రామాల్లోని కొండరెడ్ల గిరిజనుల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్ అన్నారు. శుక్రవారం రాజభవన్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో ఆయన సమీక్షించారు. జిల్లాలోని దమ్మపేట మండలంలోని పూసుకుంట, అశ్వారావుపేట మండలంలోని గోగులపూడి గ్రామాల్లో కొండరెడ్ల సంక్షేమానికి రూ.48.17 లక్షలు మంజూరు అయ్యాయని, వాటిని కొండరెడ్ల కు టుంబాల్లోని రైతులకు, నిరుద్యోగులకు, యువతీ యువకులకు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించాలన్నారు. నిధులు వృథా కాకుండా తప్పనిసరిగా కొండరెడ్ల కుటుంబాల జీవనోపాధికి ఖర్చు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

## సింగరేణిలో 9న దేశ వ్యాప్త సమ్మె

### నోటీసు అందజేసిన ఏఐటీయూసీ నాయకులు

రుద్రంపూర్,(సింగరేణి) జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమ్మె సైరన్ మోగనుంది.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు భాగస్వాములు కావాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ (పర్సనల్) కవితానాయుడికి ఏఐటీయూసీ ప్రతినిధి బృందం సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ ఆలీ, ఎల్లాగౌడ్, యర్రగాని కృష్ణయ్య, చంద్రశేఖర్, కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

- రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు పరికరాలు, బెడ్లు, కుర్చీల బహూకరణ
- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



పరికరాలు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చుంచుపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు ఎక్కువని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శిక్షణ పొందుతున్న గిరిజన యువతకు వెల్డింగ్ మెషిన్స్, టూల్‌కిట్స్‌ను శుక్రవారం ఆయన అందజేశారు. స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్ స్కీం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో పలు వృత్తుల్లో నైపుణ్యం సాధించిన యువకులకు వెల్డింగ్ మెషిన్స్, టూల్ కిట్స్‌ను జిల్లా ఎస్పీ అందజేశారు. మొత్తం 10 యూనిట్లను అందజేయగా ఒక్కో యూనిట్ ధర రూ.55,000 తెలిపారు. అదేవిధంగా వెల్డింగ్‌వర్క్ షాపులో స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీమ్ (ఎస్‌సీఏ) ద్వారా గత నెలలో కాట్స్, చైర్స్, టేబుల్స్ (ఫర్నిచర్)ను వెల్డింగ్ వృత్తిలో నైపుణ్యం పొందిన గిరిజన యువతతో తయారు చేయించడం జరిగిందని, కళాశాల యాజమాన్యం అధికారులు ఎస్పీకి వివరించారు. ఆ ఫర్నిచర్‌ను బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు వెల్డింగ్ మిషన్స్, టూల్ కిట్స్‌ను వెల్డింగ్ ట్రైనీస్‌కు పంపిణీ చేశారు. అనంతరం ఐటీఐ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఫిట్టర్ తదితర విభాగాలను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే సరైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని క్రమ శిక్షణతో మెలిగితే జీవితంలో విజయం సాధించి ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. జిల్లాలోని ఆదివాసీ, గిరిజన యువత అభివృద్ధికి పోలీస్ శాఖ కూడా అన్ని రకాలుగా కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఇందిరా, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఏపీఎమ్ వెంకయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైల్లో మహిళ ప్రసవం

మధిర రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టాటానగర్ నుంచి యశ్వంతపూర్ వెళ్తున్న ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ఓ మహిళ పురిటి నొప్పులతో బాధపడుతున్న సమయంలో బంధువుల సమాచారం మేరకు మధిర రైల్వేస్టేషన్ మాస్టర్ సుధీర్‌బాబు, పాంచ్‌మెన్ కృష్ణయ్య సహకారంతో మధిర రైల్వేస్టేషన్‌లో ట్రైన్ ఆపి ఆ మహిళకు పరిశుభ్రత సిబ్బంది పురుడు పోశారు. ఆ మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు మధిర రైల్వేస్టేషన్ మాస్టర్ సుధీర్‌బాబు తెలిపారు. ఆ మహిళ మహారాష్ట్రకు చెందిన చాందాపూర్ వాసులు. రైల్వే సిబ్బందికి, డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## 13 మంది మావోయిస్టుల లొంగబాటు

● వీరిలో 8 మంది మహిళలు ● అందరిపై రూ.23 లక్షల రివార్డు

చర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీసుల ఎదుట శుక్రవారం 13మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళలుండగా, అందరిపై రూ.23 లక్షల రివార్డు ఉంది. లొంగి పోయిన మావోయిస్టులు పీఎల్‌జీఏ 2, గరియాబంద్ ఏరియా కమిటీ, దండకారణ్య కమిటీ సభ్యులని పోలీసులు చెబుతున్నారు. బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో వీరంతా నిందితులని, మావోయిస్టులు అడవుల్లో ఉండి సాధించేదేమీ లేదని, వెంటనే లొంగి పోవాలని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నేడు లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు పునరావాసం కల్పిస్తామని, వారిపై ఉన్న రివార్డు వారికే అందిస్తామన్నారు.

## గొప్ప త్యాగజీవి ప్రకాశరావు

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బాగం హేమంతరావు

బోనకల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం ప్రాణాలర్పించిన గొప్ప త్యాగజీవి కామ్రేడ్ తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు కోరారు. మండలంలోని రాయనపేట, కలకోట గ్రామాలల్లో శుక్రవారం ప్రకాశరావు 42వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడుతూ నాడు ప్రజా ఉద్యమాల్లో పని చేసిన ప్రకాశరావు పేదలకు భూమి, భుక్తి కొరకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండ పోరాడిన యోధుడని కొనియాడారు. అభ్యుదయ బావాలతో నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని గుర్తు చేశారు. ఆయన బాటలోనే కుటుంబ సభ్యులు నడుస్తున్నారని, కుమార్తె నీరజ, మనవళ్ల ప్రకాశ్, రాకేష్‌లు బత్తినేని చారిటబుల్ ట్రస్టు ద్వార పేదల కోసం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర జిల్లా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తూము రోషన్ కుమార్, తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, జక్కుల రామారావు, రమేష్, శ్రీనివాసరావుపాల్గొన్నారు.

## పట్టింపులేక.. ప్రవేశాల్లేక!

(5వ పేజీ తరువాయి)

ఖమ్మంలోని ఏఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 318రాగా, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 316, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 120, నగరంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో 81 అడ్మిషన్లు వచ్చాయి. అత్యల్పంగా కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో13 అడ్మిషన్లు నమోదవడం విశేషం. జనరల్, ఒకేషనల్ రెండు కోర్సుల్లో కలిపి జిల్లా వ్యాప్తంగా ఆ ఏడాది మొత్తం 2,313 కొత్త అడ్మిషన్లు వచ్చాయి. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో మొత్తం 2,365 అడ్మిషన్లు వచ్చాయి. ఇందులో ఖమ్మం బాలికల జూనియర్ కళాశాలలో జనరల్, ఒకేషనల్‌లో కలిపి 506, శాంతినగర్‌లో 415, నయబజార్‌లో 189, సత్తుపల్లి బాలికల కళాశాలలో 104, మధిరలో72, సిరిపురంలో 30, వైరాలో 72, కల్లూరులో 74, ఏన్కూర్‌లో 75, పిండిప్రోలులో 88, ఎర్రుపాలెంలో 51, నేలకొండపల్లిలో 108, నాగులవంచలో 64, కామేపల్లిలో 16, సింగరేణిలో 140, ముదిగొండలో 83, బోనకల్‌లో 59, పెనుబల్లిలో 83, బండి సోమకాంతం ప్రభుత్వ కాలేజీలో 15 అడ్మిషన్లు వచ్చాయి. ఇక ఈ ఏడాది విద్యా సంవత్సరానికి గాను ఇప్పటి వరకు 2,369 అడ్మిషన్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

**మెరుగైన సౌకర్యాలతో గురుకులాల వైపు..**

గురుకులాలు, కేజీబీవీ కళాశాలల్లో సెకండియర్ విద్యార్థులకు ఇంటర్ తర్వాత నిర్వహించే పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇలాంటి సదుపాయం లేదు. కేవలం సబ్జెక్ట్ బోధించడం వరకే అధ్యాపకులు పరిమితమవుతున్నారు. కానీ గురుకులాల్లో అధ్యాపకులు రాత్రి వరకు అందుబాటులో ఉంటున్నారు. అనుమానాలు నివృత్తి చేసుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. అలాగే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుండటం, పుస్తకాలతోపాటు భోజనం, వసతి కల్పిస్తుండటంతో తల్లితండ్రులు పిల్లలను గురుకులాల్లో చేర్పేందుకు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తున్నా అధ్యాపకుల కొరత, మధ్యాహ్న భోజనం లేకపోవడం, తరగతుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం లాంటివి విద్యార్థులు గురుకులాలపై ఆసక్తి చూపేందుకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. గురుకులాల్లో సీట్లు దొరకని విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందుతున్నారు. ఖమ్మం నగరంలోని శాంతినగర్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలకు హాస్టల్ సదుపాయం ఉండటంతో ఇక్కడ అడ్మిషన్లు ఏటా అధికంగానే ఉంటాయి. మిగిలిన కళాశాలల్లో చేరికల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది.

## రైతులకు తోడుగా..

(5వ పేజీ తరువాయి)


ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, లూజుగా వెలాడుతున్న విద్యుత్ తీగలు, విరిగిన, వంగిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి వాటిని సాధ్యమైనంత త్వరగా సరి చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల లో వోల్టేజీ సమస్యలు గుర్తిస్తున్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు. రైతులు విద్యుత్ సరఫరా వ్యవస్థను ముట్టుకుంటే జరిగే ప్రమాదాలను వివరిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా అప్రమత్తం చేస్తున్నారు.

**ఇప్పటి వరకు 2,325 సమస్యలు పరిష్కారం..**

ఖమ్మం జిల్లాలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని గతేడాది జూలై 28 న ప్రారంభించగా.. ఇప్పటి వరకు పొలంబాట కార్యక్రమంలో 3,969 మంది రైతులు 2,591 సమస్యలను విన్నవించారు. వాటిలో 2,325 సమస్యలకు అధికారులు పరిష్కారం చూపారు. ఖమ్మం నగరం డివిజన్‌లో 1,114సమస్యలు, ఖమ్మం రూరల్ డివిజన్‌లో 440, వైరా డివిజన్‌లో 171, సత్తుపల్లి డివిజన్‌లో 600 సమస్యలను పరిష్కరించారు. వీటిలో లూజ్‌లైన్ల సర్దుబాటు 832, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు 78, మధ్యలో స్తంభాల ఏర్పాటు 1,160 వరకున్నాయి.

## కాంగ్రెస్ పాలనలో జిల్లా అభివృద్ధి శూన్యం

### మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు సీతారాంనాయక్




పాల్వంచ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో జిల్లా అభివృద్ధి శూన్యమని మాజీ ఎంపీ బీజేపీ రాష్ట్ర నాయకుడు అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. శుక్రవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని వనరులు ఉన్నా ప్రభుత్వం మాత్రం అభివృద్ధి దిశగా కృషి చేయడంలో విఫలమవుతుందని విమర్శించారు. పరిశ్రమల పరంగా కేటీపీఎస్, ఎన్ఎండీసీ, ఎపీస్టీల్ వంటి పరిశ్రమలో ఓ వెలుగు వెలిగిన జిల్లా ముఖ్యంగా పాల్వంచ పట్టణం, ఇప్పుడు వలసల పట్టణంగా మారిందని, ఈ దుస్థితికి మాజీముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం బాధ్యతలు వహించాలన్నారు. ఎన్ఎండీసీ మూతపడటం, కేటీపీఎస్ పాత ప్లాంట్ కూల్చివేత నిర్ణయాలే ఇందుకు కారణమని ఆరోపించారు. ప్రస్తుత పాలక కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధిలో మాత్రం రిక్తహస్తం చూపుతున్నారన్నారు. గిరిజన ప్రాధాన్యత కలిగిన షెడ్యూల్ ఏరియాల్లో కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు సమయంలో సంప్రదింపులు లేపకపోవడం పట్ల ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణలో జాప్యం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు భూక్య సీతారాంనాయక్, యడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, బుడగం రవి, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, దోమల రమేష్, రవి రాథోడ్, దున్నపోతుల రాజు, దాసరి రమేష్, వెంకట్, రామారావు, వెంకటేశ్వర్లు, వీరన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**విజయలక్ష్మికి మాజీ ఎంపీ పరామర్శ**

మండల పరిధి పాండురంగాపురం గ్రామానికి చెందిన మహిళ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బాణోత్ విజయలక్ష్మిని శుక్రవారం మాజీ ఎంపీ సీతారాంనాయక్ పరామర్శించారు. విజయలక్ష్మి భర్త కిషన్‌నాయక్ ఇటీవల మృతి చెందడంతో విజయలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## కాలం కలిసొస్తే.. జూలైలోనే సాగునీరు

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి.. మరమ్మతులు ఏమైనా చేయాల్సి ఉందా?

**ఎస్ఈ:** పాలేరు నుంచి వేంసూరు వరకు సుమారు 150కిలోమీటరు సాగర్ ప్రధాన ఎడమకాలువ ఉంది. అయితే ఈ కాలువలో పొదలు తొలిగింపునకు రూ.కోటి మంజూరయ్యాయి. ఈ పనులు వెంటనే మొదలు పెడుతున్నాం. అలాగే సాగర్‌కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు కూడా జరుగుతున్నాయి. ఇంకా అవసరం ఉన్న చోట్ల పనులకు ప్రతిపాదనలు చేశాం. కాలువల్లో నీరు విడుదల నాటికి మరమ్మతులన్నీ పూర్తవుతాయి.

**ఆంధ్రజ్యోతి:** ఏన్కూరు లింక్‌కెనాల్ ఈఏడాది సాగర్ ఆయకట్టుకు అనుసంధానమవుతుందా?

**ఎస్ఈ:** తప్పనిసరిగా అవుతుంది. అయితే గోదావరిలో ప్రస్తుతం నీటి లభ్యతలేదు. అయితే కృష్ణాలోనీరు ముందుగా వస్తుంది. సాగర్ నీరు విడుదలైతే- గోదావరి నీటిని సాగర్‌కాలవకు వదిలే అవకాశం ఉండకపోవచ్చు. ఒకవేళ కృష్ణాలో నీరు రాక గోదావరిలో నీరు ముందుగా వస్తే ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు గోదావరి జలాలు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. వైరా ప్రాజెక్టుకు కూడా అనుసంధానం చేసేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయి.

**ఆంధ్రజ్యోతి:** సాగర్ కెనాల్ పరిధిలో కొత్త ఎత్తిపోతల పథకాలకు ప్రతిపాదనలున్నాయా?

**ఎస్ఈ:** సాగర్ ఎడమకాలువలపైనా రూ.66కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పనులు పూర్తిచేశాం. సాగర్‌కాలువకు నీరు విడుదల కాగానే మంచుకొండ ఎత్తిపోతలను ప్రారంభించి రఘునాథపాలెం మండలంలో చెరువులన్నింటిని నింపి సస్యశ్యామలం చేయబోతున్నాం. అలాగే సాగర్ రెండు, మూడో జోన్ అనుసంధానం చేసేందుకు, మధిర ఎర్రుపాలెం మండలాలకు సాగర్ నీరు సకాలంలో అందేందుకు రూ.690కోట్లతో 17,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వంగవీడు వద్ద మూడు పంప హౌజ్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నాం. దీనికి టెండర్లు పూర్తయ్యాయి. త్వరలో పనులను ప్రారంభిస్తాం.

**ఆంధ్రజ్యోతి:** మున్నేరు లింక్‌కెనాల్ పరిస్థితేంటి?

**ఎస్ఈ:** పాలేరు రిజర్వాయర్‌కు మున్నేరు నుంచి వృథాగా పోతున్న వరదనీటిని పాలేరు జలాశయానికి తరలించేందుకు రూ.102కోట్లతో ఈ లింక్ కెనాల్ నిర్మాణం జరగబోతోంది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ములకనూరు నుండి బుద్ధారం వరకు పాలేరు సీతారామ ఎత్తిపోతల లింక్‌కెనాల్‌ను 37కి.మీ.పైగా నిర్మించి పాలేరు సీతారామ లింక్‌కెనాల్‌కు అనుసంధానం చేస్తాం. ఇది పూర్తయితే మున్నేరులో వచ్చే వరదను పాలేరుకు మళ్లించే అవకాశం ఉంటుంది. ఈపనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయి. మున్నేరు వరద నియంత్రణకు ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో చేపట్టిన వరద కట్టల నిర్మాణం వచ్చే ఏడాదినాటికి పూర్తవుతాయి. ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

**ఆంధ్రజ్యోతి:** సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్‌కెనాల్ పనులతోపాటు అదనపు ఆయకట్టుకు అవసరమైన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనుల పరిస్థితేంటి?

**ఎస్ఈ:** సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతలలో భాగంగా పాలేరు లింక్‌కెనాల్ ప్యాకేజీ నెంబరు 14, 15, 16 కింద టెండర్లను గతంలోనే పూర్తిచేశాం. 16వ ప్యాకేజీలో 50శాతం పనులు, 14, 15ప్యాకేజీల్లో 80శాతం పనులు జరిగాయి. ప్యాకేజీ 14లో భూసేకరణ జరుగుతుంది. ప్యాకేజీ13 కూడా టెండర్లు పూర్తయి పనులను ప్రారంభించాం.

అలాగే సీతారామ పాలేరు లింక్‌కెనాల్‌నుంచి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిమిత్తం ప్యాకేజీ 3 కింద రూ.250.34కోట్లు, ప్యాకేజీలో 4లో 676.66కోట్లు ప్యాకేజీలో 5లో రూ.341.21కోట్లతో ప్రతిపాదనలు చేశాం. ఇక టెండర్లు పిలవాల్సి ఉంది. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పూర్తయితే జిల్లాలోని సాగునీరు లేని వేలాది ఎకరాలకు సాగునీరుందే అవకాశం లభిస్తుంది.

## ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు

(5వ పేజీ తరువాయి)

సీతక్క ప్రారంభించారు. అధికారులు గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. సీతక్క వెంట భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, స్థానిక నాయకులు చీమల మర్రి మురళీకృష్ణ, బండారి రామకృష్ణ, విజయభాస్కర్ రెడ్డి, వసంత్, లంక రాజు, ఇతర నాయకులున్నారు.

భారీ బందోబస్తు

మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో ఏజెన్సీ మండలాలైన చర్ల, దుమ్ముగూడెంలలో సీఐలు రాజువర్మ, బి.అశోక్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ నేతృత్వంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లో తనిఖీలు చేపట్టారు. అలాగే చర్ల మండలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ఆనుకుని ఉండడం, మావోయిస్టులు లక్ష్యంగా కేంద్ర బలగాలు ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కూడా డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాయి.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు గౌతమ్

ఖమ్మంస్పోర్ట్స్, జూన్27 (ఆంధ్రజ్యోతి): త్వరలో మెదక్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు నయాబజార్ కళాశాలలో ఇంటర్ ద్వితియ సంవత్సరం చదువుతున్న బి.గౌతమ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్‌ఈ వివరాలు వెల్లడించారు. గౌతమ్ ఈనెల26న నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడని ఆయన తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గౌతమ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ జి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


గౌతమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్

## హామీలు నెరవేర్చాలి

**ఖమ్మంలో తెలంగాణ ఉద్యమకారుల రాస్తారోకో**



రాస్తారోకో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్రస్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ.కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వందలాదిమంది ఉద్యమకారులతో ఖమ్మం మయూరిసెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. హామీలు అమలు చేయకపోతే వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పసుపులేటి నాసరయ్య, అర్వపల్లి విద్యాసాగర్, పగడాల నరేందర్, గుంతేటి వీరభద్రం, పాలకుర్తి కృష్ణ, సీపీఐ నాయకులు శింగునరసింహారావు, మేకల శ్రీనివాస్, , రెడ్డబోయిన వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'యూటీ' నిర్మాణ పనుల తనిఖీ


పనుల మ్యాపు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కూసుమంచి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం సమీపంలో సాగర్ కాల్వపై 132.5 కిలోమీటరు వద్ద రూ.14కోట్లతో నిర్మాణంలో ఉన్న అండర్ టన్నల్(యూటీ)ను క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం తనిఖీ చేసింది. పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖమ్మం సర్కిల్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, క్యూసీ ఈఈ వెంకటరామారావు, డీఈ చంద్రమోహన్, ఏఈ రవీందర్ ఉన్నారు.

# వైభవంగా జగన్నాథ రథయాత్ర

**» ప్రారంభించిన హెవీవాటర్ ప్లాంట్ జీఎం » గౌతమీనగర్‌లో కోలాహలం**

అశ్వాపురం,జూన్27(ఆంధ్రజ్యోతి): హెవీవాటర్ ప్లాంట్ గౌతమీనగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. హెవీవాటర్ ప్లాంట్ జీఎం శ్రీనివాస్ ఈ రథయాత్రను ప్రారంభించారు. ఒడిషాలోని పూరి జగన్నాధరథయాత్రకు అనుసంధానంగా, ఏటా అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో ఈ వేడుక నిర్వహిస్తున్నారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన ఉద్యోగులు, అధికారులు ఉత్కల్ పథాగర్ సంస్థగా ఏర్పడి ఉత్సవాలను జరుపుకుంటున్నారు. రథయాత్రను పురస్కరించుకుని జగన్నాథస్వామి, బలభద్రస్వామి,సుభద్రాదేవిల విగ్రహలకు పహండీగుహలో పూజలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను ప్రత్యేక పల్లకీలలో మేళతాలాలతో, ఒడిషా సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించారు. జీఎం శ్రీనివాస్ చెరపరా (రథాన్ని తుడవటం) కార్యక్రమం నిర్వహించి దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రథం తాడును లాగి రథయాత్రను వైభవంగా ప్రారంభించారు. రథయాత్ర సందర్భంగా అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో కోలాహలం నెలకొంది.రథయాత్ర జరిగే ప్రదేశంలో కాలనీలో విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ యాత్రను తిలకించేందుకు కాలనీవాసులు పెద్దఎత్తున తరలి రావటంతో పండుగ వాతావరణం ఏర్పడింది. కాగా తొమ్మిది రోజుల నిత్యపూజల అనంతర జూలై 5నజరిగే బహుదా యాత్రతో రథయాత్ర ముగియనుంది.


ప్రత్యేక రథంపై ఆసీనులయిన దేవతామూర్తులు


పూజలు నిర్వహిస్తున్న జీఎం


యాత్రలో పాల్గొన్న భక్తులు

## స్వర్ణకవచంలో దర్శనమిచ్చిన రామయ్య

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిమూలవరులను స్వర్ణకవచంతో అలంకరించారు. ప్రతీ శుక్రవారం మూలవరులను స్వర్ణకవచంలో అలంకరింపజేస్తారు. శ్రీరామచంద్రుని జన్మనక్షత్రమైన పునర్వసు రోజున కొత్తగూడెం భక్తరామదాసు ట్రస్టు నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భద్రగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతనెల నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ఇక నుంచి ప్రతి పునర్వసు రోజున నిర్వహిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమనిర్వహణకు మార్గదర్శకం చేసిన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, అధర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులకు, సహకరించిన ఈవో రమాదేవికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శుక్రవారం దర్శించుకున్నారు.


భద్రగిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

## పసుపుకొమ్ముల కనకదుర్గమ్మ

**గుర్రాలచెరువులో ప్రత్యేక అలంకరణ**

అశ్వారావుపేట రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని గుర్రాలచెరువు గ్రామంలో స్వయంభూ శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాస ప్రత్యేక పూజల్లో భాగంగా అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు రెండు రోజుల పాటు శ్రమించి క్వింటా పసుపుకొమ్ములను దండలుగా అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించారు.



## పర్ణశాల రామయ్య మూలవరులకు రజత కవచాలు

**రూ.12 లక్షలతో తయారు చేయించిన నెల్లూరు భక్తులు**

భద్రాచలం/దుమ్ముగూడెం,జూన్27(ఆంధ్రజ్యోతి): పర్ణశాలలోని శ్రీసీతారామచంద్రస్వామి మూలవరులకు రజత కవచాలను ఏపీలోని నెల్లూరుకు చెందిన భక్తులు ఓ.సంతోష్‌కుమార్‌రెడ్డి, సాహిత్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు సమర్పించారు. శుక్రవారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో తొమ్మిది కేజీల వెండితో రూ.12 లక్షల విలువైన వెండి కవచాలను భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఏఈవో వి.శ్రవణ్‌కుమార్‌కు అందజేశారు. అంతకుముందు వారు భద్రాద్రి రామయ్యకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, సీసీటూ ఈవో ఎ.శ్రీనివాసరెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


భద్రాచలం ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు రజత కవచాలను అందజేస్తున్న భక్తులు

## సింగరేణి అభివృద్ధికి గుర్తింపు కార్మిక సంఘం సహకరించాలి

**» డైరెక్టర్ (పా) గౌతమ్‌పోట్రు**

రుద్రంపూర్, (సింగరేణి)జూన్27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధికి గుర్తింపు కార్మికసంఘం సహకరించాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్‌పోట్రు పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదనలో కార్మికసంఘాల పాత్ర కీలకమైందని గుర్తు చేశారు. శుక్రవారం ఇల్లెందు క్లబ్‌లో గుర్తింపు కార్మికసంఘం ఏఐటీయూసీ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి సైతం యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధనతోపాటు భూగర్భ గనుల్లో కార్మికుల హాజరు శాతాన్ని పెంచేవిధంగా చూడాలని కార్మికసంఘాలకు కోరారు. బొగ్గుఉత్పత్తి వ్యయం తగ్గించి నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. గుర్తింపు కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్ కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. యాక్టింగ్ క్లర్క్‌లను క్రమద్ధీకరించాలని, సెక్యూరిటీ గార్డుల పోస్టుల సింగరేణి కార్మికులతో భర్తీ చేయించాలని కోరారు. కారుణ్య నియామకాల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జీఎంలు కవితానాయుడు, మనోహర్, ఎం.సుబ్బారావు, రఘురాంరెడ్డి, జీవీ. కిరణ్‌కుమార్, బొజ్జ రవి, ధనసరి వెంకటేశ్వర్లు, ఏజీఎం రాజేంద్ర ప్రసాద్, డీజీఎంలు వెంకయ్య, అజయ్‌కుమార్, వర ప్రసాద్, రాజ్‌గోపాల్, నారాయణరావు, ముకుంద సత్యనారాయణ, కార్మికసంఘాల నాయకులు మిర్యాల రంగయ్య, వంగా వెంకట్, అక్బర్ ఆలీ, సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.


గౌతమ్‌కు వినతిపత్రాన్ని అందచేసిన గుర్తింపు కార్మిక సంఘం నాయకులు

## అర్ధరాత్రి వరకు కొనసాగిన ఏసీబీ సోదాలు

**» పలు ఆధారాలు సేకరించినట్లు సమాచారం**


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు, సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న ఏసీబీ డీఎస్పీ

బూర్గంపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యలయంలో గురువారం ఏసీబీ ఆదికారులు చేపట్టిన ఆకస్మిక తనీఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. గత కొంత కాలం నుంచి పిర్యాదు రావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో తనీఖీలు చేపట్టారు. తనీఖీల సమయంలో కార్యలయంలో ఉన్న బయట వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలుస్తోంది. అలాగే కార్యలయంలోని రికార్డులు, భూముల రిజిస్ట్రేషన్‌కు సంభదించిన ఆర్థిక లావాదేవీల పత్రాలు, కంప్యూటర్లు, వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలు, తదితర రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో ఆన్‌లైన్ నగదు లావాదేవీలను గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. పూర్తిస్థాయి నివేదికను శాఖాపరమైన చర్యల నిమిత్తం ఉన్నాతాదికారులు సమర్పించినట్లు తెలుస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యలయంలో చేసిన వివిధ రిజిస్ట్రేషన్‌ల నిమిత్తం జరిగిన ఆర్థిక లావాదేవీల ఆధారాలను ఏసీబీ ఆదికారులు సేకరించిన వారిలో రాజకీయ నాయకులతో పాటు, పలువురు పాత్రికేయులు ఉన్నట్లు సోషల్ మీడియా వేదికగా మండలంలో తీవ్ర చర్చ కొనసాగుతంది. దీంతో మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తులు ఏం జరుగుతుందోననే ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## పాముకాటుతో యువకుడి మృతి

దుమ్ముగూడెం జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అడవిరామవరానికి చెందిన మడివి హరీష్(28) గురువారం అర్ధరాత్రి పాముకాటుతో మృతిచెందాడు. కామయ్య, భద్రమ్మల కొడుకు హరీష్ పత్తి పొలాన్ని శుభ్రం చేస్తున్న క్రమంలో పామును తొక్కడంతో అది కరిచింది. వెంటనే పొలం నుంచి

ఇంటికి వచ్చిన క్రమంలో కు టుంబసభ్యులెవరూ ఇంట్లోలేకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ఆటోలో చికిత్సల కోసం తరలిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించింది.

### కుమారుడి భవిష్యత్‌పై బెంగతో

## ఉరేసుకుని తండ్రి ఆత్మహత్య

**జూలూరుపాడు మండలంలో ఘటన**

జూలూరుపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్నెల్ల క్రితం అనారోగ్యంతో భార్య కన్నుమూసింది. దాంతో తన మూడేళ్ల కుమారుడి బాగోగులు చూసుకునేందుకని రెండో పెళ్లి చేసుకున్నాడు. కానీ అటు మొదటి భార్య పుట్టింటివారు.. ఇటు రెండో భార్య తన కుమారుడిని సక్రమంగా చూడకపోతుంటడంతో దిగాలు చెందాడు. తన కుమారుడి భవిష్యత్ ఎలాగోనన్న మనోవేదనతో ఆ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం బేతాళపాడు పంచాయతీ పరిదిలోని రాచబండ్ల కోయగూడెం గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జూలూరుపాడు మండలంలోని అన్నారుపాడు గ్రామానికి చెందిన బానోత్ భద్రం(28) పదేళ్ల క్రితం మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ప్రియాంకను వివాహం చేసుకున్నాడు. వారికి కుమారుడు వీక్షిత్ జన్మించగా.. ప్రస్తుతం అతడి వయస్సు మూడేళ్లు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం అనారోగ్యంతో ప్రియాంక మృతి చెందింది. దీంతో తనకు తోడుగా ఉండటంతో పాటు మూడేళ్ల వయసున్న కుమారుడి ఆలనాపాలనా, బాగోగులు చూసుకునేందుకు గాను బేతాళపాడు గ్రామానికి చెందిన పద్మ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత నుంచి వీక్షిత్‌ను అటు మొదటి భార్య కుటుంబ సభ్యులు, ఇటు రెండో భార్య పద్మ సరిగ్గా చూసుకోవటంలేదు. దీంతో కొద్దిరోజులుగా తన కుమారుడి భవిష్యత్ గురించి ఆలోచనలో పడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం తీవ్ర మనస్థాపానికి గురైన భద్రం ఉదయం 7గంటల సమయంలో రాచబండ్లకోయగూడెం గ్రామ శివారులోని ఓ పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బానోత్ బద్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఏఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

# భర్త ఇంటి ఎదుట ఆందోళన

ఖమ్మం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని బిడ్డను కని ఏడాదిగా భార్య, బిడ్డలను పట్టించుకోకుండా మొహం చాటేశాడు ఆ భర్త. భర్త మొహం చాటేయడంతో భార్య తన బిడ్డను తీసుకుని భర్త ఇంటి ఎదుట నిరసన తెలిపింది. ఈ సంఘటన ఖమ్మం రూరల్ మండలం, ఎం వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాదితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి పరిమలను మండలంలోని ఎం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పాపిట్ల మహేష్ 2018 నుంచి ప్రేమించుకున్నారు. వీరిరువురు 2024లో పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. ఆ త రువాత వీరికి ఓ బాబు జన్మించాడు. అయితే నాటి నుంచి మహేష్ తన భార్య పరిమలతో మాట్లాడకుండా ఆమెను తీసుకువెళ్లకుండా ఆమెను పట్టించుకోవడంలేదు. ఎంతకి తన భర్త పట్టించుకోక పోవడంతో పరిమల తనబిడ్డను తీసుకుని వెంకటాయపాలెంలోని తన భర్త మహేష్ ఇంటికి వెళ్లి ఇంటి ఎదుట కూర్చుని నిరసన తెలిపింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిమలతో మాట్లాడారు. గ్రామ పెద్దలు మహేష్‌ను పిలిపించి మాట్లాడతాం రెండు రోజులు గడువు ఇవ్వమని కోరడంతో పరిమల నిరసన విరమించింది.


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న యువతి

## కేటీపీఎస్ 5వ దశలో ప్రమాదం

**» నైట్రోజన్ సిలిండర్ పేలి ఆర్టిజన్ కార్మికుడి మృతి**

పాల్వంచ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 5వ దశలో శుక్రవారం ప్రమాదం జరిగింది. టర్బైన్ ప్రాంతంలో పనులు జరుగుతుండగా ఒక్కసారిగా నైట్రోజన్ సిలిండర్ పేలింది. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పాల్వంచ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఆర్టిజన్ కార్మికుడు ముద్రబోయిన సుబ్బారావు(48)కు తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా.. కానీ అప్పటికే ఆయన ప్రాణాలు కొల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేటీపీఎస్ అధికారులు విచారణకు ఆదేశించగా.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కేటీపీఎస్ కార్మికులు తీవ్ర భయాందోళనకు గురవగా.. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేటీపీఎస్‌లో తొలుత కాంట్రాక్ట్‌కార్మికుడిగా పనిచేసిన సుబ్బారావు 2017 నుంచి ఆర్టిజన్ కార్మికుడిగా కొనసాగుతున్నారు. సుబ్బారావుకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. సుబ్బారావు మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.


సుబ్బారావు (ఫైల్)

### పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో

## అరుదైన శస్త్రచికిత్స

**విరిగిన దవడ ఎముకను అతికించిన వైద్యులు**

పాల్వంచ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విరిగిన దవడ ఎముకకు అరుదైన శస్త్ర చికిత్స చేసి దవడ ఎముకను అతికించిన అరుదైన ఘటన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. పాల్వంచ మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన చైతన్య ప్రకాష్ తాపీ పని చేస్తూ 20 రోజుల క్రితం మూడో అంతస్తునుంచి జారి కిందపడటంతో అతడి దవడ ఎముక విరిగింది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. దీంతో దంతవైద్యుడు డాక్టర్ వంశీ కృష్ణ పరీక్షించి దవడ ఎముక విరిగినట్లు గుర్తించి, దవడ ఎముకకు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. దవడకు అమర్చిన ఆర్చ్‌బార్స్‌ను శుక్రవారం తీసి వేసి పరీక్షించి అతన్ని ఇంటికి పంపారు. లక్ష రూపాయలు పై ఖర్చుతో చేయని ఆపరేషన్‌ను జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించడం పట్ల బాధిత కుటుంబసభ్యులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ వ్యక్తికి మోకాలి ఆపరేషన్‌ను సైతం విజయవంతంగా నిర్వహించి, పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి అరుదైన ఆపరేషన్లకు నెలవుగా నిలిచింది. అరుదైన వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రి సిబ్బందిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు అభినందించారు.


ఆపరేషన్ అనంతరం చైతన్య

## కుక్కల దాడిలో దుప్పి మృతి

దమ్మపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి పెద్దగొల్లగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అటవీప్రాంతం నుంచి గొల్లగూడెం గ్రామంలోకి రాత్రి దుప్పి రాగా కుక్కలు వెంటబడి దాడి చేయటంతో దుప్పి మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్థులు దమ్మపేట అటవీశాఖాధికారులకు సమాచారం ఇవ్వంటంతో మృతి చెందిన దుప్పిని అటవీ కార్యాలయానికి తరిలించినట్లు సమాచారం.


కుక్కల దాడిలో మృతి చెందిన దుప్పి



## రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 24 ట్రయథ్లాన్ ఎంపికలతో పాటు, సబ్ జూనియర్ అండర్- 10, 12 విభాగంలో అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట కల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి
# ఇసుక కేటాయించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
ఇసుక సరఫరాపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, జూన్27(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా మండలాల వారీగా ఎక్కడి నుంచి ఇసుక తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయించి ఇసుక రీచ్‌లను కేటాయించిందన్నారు. మండలాల్లో ఎక్కడైనా ఇసుక తరలించే పాయింట్ అందుబాటులో ఉంటే ఆ వివరాలను తహసీల్దార్ అందించాలని సూచించారు. లబ్ధిదారులకు హౌజింగ్ శాఖ ఏఈ నుంచి ఏ సమయంలో ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందో వివరాలతో లేఖ అందించాలన్నారు. ఏఈ అందించిన లేఖ ఆధారంగా తహసీల్దార్ కూపన్ జారీ చేస్తారని, కూపన్‌తో 3రోజులలో సంబంధిత మండలానికి కేటాయించిన ఇసుక రీచ్ నుంచి ఇసుక తీసుకురావాల్సి ఉంటుందని, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇసుక రీచ్ లు నిర్వహిస్తున్నామని, ప్రతీ ట్రాక్టర్‌లోడ్ ఇసుకకు రూ.200 తహసీల్దార్ కార్యాలయంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందులో వందరూపాయలు మహిళా సంఘాలకు, రూ.50 స్థానిక గ్రామ పంచాయతీలకు, రూ.50గ్రామీణ అభివృద్ధి శాఖకు వెళ్తాయన్నారు. ఉదయం 6.00గంటల నుంచి సాయంత్రం 6.00గంటల వరకు మాత్రమే ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలించాల్సి ఉంటుందన్నారు.

**విపత్తు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు**

విపత్తు నిర్వహణ కోసం అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ అన్నారు. టార్చ్ లైట్, లైఫ్ జాకెట్, స్పీకర్ మైక్ సెట్స్, బోట్లు, జిప్ కవర్, గజఈతగాళ్లకు ఎంత వరకు అందుబాటులో ఉన్నాయో పరిశీలించాలన్నారు. ప్రతీ 15రోజులకు ఒకసారి మండల స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆపద మిత్ర, గజ ఈతగాళ్లతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉండాలన్నారు. జిల్లాలో 24సభ్యులతో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్, 24సభ్యులతో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా మైనింగ్ అధికారి సాయినాథ్, ఆర్డీవోలు నరసింహారావు, ఎల్. రాజేందర్, డీపీవో రాంబాబు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఓలు, హౌజింగ్ ఏఈ లు పాల్గొన్నారు.

# ముందుకు సాగని అర్బన్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం

- 7నెలలుగా స్లాబ్, గోడల నిర్మాణానికే పరిమితమైన ఆరోగ్య కేంద్రం
- నగరంలో వైద్యసేవల వికేంద్రీకరణపై తీవ్ర ప్రభావం
- ముసురుతున్న వైరల్ ముప్పు
- మరో రెండు నెలల్లో పూర్తి.. కృష్ణలాల్: ఈఈ, కేఎంసీ




నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణం, ప్రహరీ నిర్మాణానికి వాడుతున్న బూడిద

ఖమ్మంకార్పొరేషన్, జూన్27(ఆంధ్రజ్యోతి): నగరంలోని 4వ డివిజన్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య భవనం ఏడునెలలుగా నిర్మాణం జరుగుతోంది. కేఎంసీలో విలీన ప్రాంతాలకు అనుకూలంగా ఖైకొండాయిగూడెం స్టేజీ సమీపంలో ఇల్లెందు రహదారి వెంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థలం కేటాయించారు. 2024నవంబరు 25న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కనీసం పదిడివిజన్ ప్రజలకు స్థానికంగా వైద్య సేవలు అందించేందుకు 15వఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం నిర్మాణ అవశ్యకతను అధికారులకు వివరించారు. వైరల్ జ్వరాలు సీజన్ వచ్చే నాటికి భవనం అందుబాటులోకి రావాలని ఆదేశించారు.

**7నెలలుగా స్లాబ్ గోడలకే..**

ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం 7నెలలుగా స్లాబ్, గోడలకే పరిమితమైంది. పూర్తి స్థాయిలో నిర్మాణం కావాలంటూ మరో నాలుగు నెలలు పట్టే అవకాశం ఉంది. సాధారణంగా భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ మేరకు కాలపరిమితిని కేటాయిస్తారు. వైద్య, అత్యవసర సేవల భవనాలను అధికారులు ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణ చేసి నిర్మాణాలు పూర్తి చేయిస్తుంటారు. కానీ రూ.1.43కోట్లతో నిర్మాణం జరిగే భవనం నత్తనడకన సాగుతుందని స్థానికంగా ఉన్న ప్రజలు ఆరోపిస్తున్నారు.

**అధిక మోతాదులో డస్టు వ్యర్థాలు**

భవనం నిర్మాణంలో అధిక మోతాదులో డస్టు వ్యర్థాలను వాడుతున్నారని స్థానికంగా చర్చ జరుగుతుంది. పదికాలాల పాటు ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడాల్సిన భవనం నిర్మాణం నాణ్యతపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణం పూర్తిచేస్తే సీజనల్ వ్యాధుల సమయానికి 10డివిజన్‌ల ప్రజలకు స్థానికంగానే మంచి వైద్యసేవలు అందనున్నాయి.

**నిధులు మంజూరు చేసినా..**

విలీన ప్రాంతాల ప్రజలు జిల్లా హాస్పటల్ వరకు వైద్యసేవలకు వెళ్లకుండా స్థానికంగానే సేవలందించేందుకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి మంత్రి తుమ్మల శ్రీకారం చుట్టారు. నగరానికి నలు దిశలుగా అర్బన్ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తే జిల్లా హాస్పటల్‌పై భారం తగ్గుతుందని భావించారు. స్థానికంగానే వైద్యసేవలు అందించాలని కార్యచరణ చేశారు. నిధులు మంజూరులో ఎటువంటి రాజీపడలేకుండా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనానికి నిధులు మంజూరు చేశారు. కానీ నత్తే నయం అనే రీతిగా భవనం నిర్మాణం జరుగుతుంది.

**మరో రెండు నెలల్లో పూర్తి: కృష్ణలాల్, ఈఈ కేఎంసీ**

4వ డివిజన్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంలో ఉంది. పనులు జరుగుతున్నాయి. వేగంగా పనులు జరిపేందుకు పర్యవేక్షణ పెంచుతాం. మరో రెండు నెలల్లో భవనం అందుబాటులోకి తీసుకొస్తాం.

## డిగ్రీ ప్రవేశాలకు 30న చివరి అవకాశం

రఘునాథపాలెం, జూన్27(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 30న చివరి అవకాశం కల్పిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వేలసాని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీ వంటి గ్రూప్‌ల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పూర్తివివరాలకు విద్యార్థులు 99639 30937, 70326 32863 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

## వీరబాబుకు కవిసామ్రాట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వీరబాబు

నేలకొండపల్లి,జూన్27(ఆంధ్రజ్యోతి): సాహిత్యంలో విశిష్ట సేవలందించిన నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామానికి చెందిన చిలకబత్తిన వీరబాబు కవిసామ్రాట్ అవార్డును అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని చిక్కడపల్లి, త్యాగరాయ గానసభలో మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ మ్యూజిక్‌డే, ఇంటర్నేషనల్ యోగా డేను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో మాజీస్పీకర్ మధుసూధనాచారి ఈ అవార్డును అందజేశారు.

## లకారం ట్యాంక్‌బండ్‌పై చీకట్లు

**త్రీఫేజ్ కరెంట్ లేక వెలగని దీపాలు**

**నిరాశతో వెనుదిరిగిన ప్రజలు**

ఖమ్మంకార్పొరేషన్, జూన్27(ఆంధ్రజ్యోతి): వారంతంలో కొద్ది సమయం ఆహ్లాదంగా ఉందామని లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లిన వారికి శుక్రవారం నిరాశే మిగిలింది. లకారం ట్యాంక్‌బండ్‌కు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. వెంటనే దానిని సంబంధిత అధికారులు పరిష్కరించలేక పోయారు. కదిలే వంతెనతో పాటుగా ప్రధానమైన లైట్లు వెలగకపోవటంతో లకారం ట్యాంక్‌బండ్ తన ఆహ్లాదాన్ని కోల్పోయింది. చాలా మంది ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. కాగా కొన్ని నెలలుగా లకారం ట్యాంక్‌బండ్‌లోపల మ్యూజిక్ ఫౌంటేన్లు పనిచేయటం లేదు. కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించి లకారం ట్యాంక్‌బండ్‌కు పూర్వవైభవం తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కూసుమంచి, జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేట బజార్ గ్రామ పంచాయతీ శివారు తాళ్లగడ్డతండాలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు తొలగించారు. దానిని స్తంభానికి ఎత్తులో బిగించారు. తండాలో చేతికి అందేవిధంగా ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో 'ఆంధ్రజ్యోతి' పత్రిక అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. స్పందించిన విద్యుత్‌శాఖ పాలేరు ఏఈ తావూర్యా, లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సిబ్బంది స్తంభానికి కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, పైకి ఎత్తులో అమర్చారు.




## హౌస్ కీపింగ్ సిబ్బందికి దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ, టీఎంసీ సుజాతరాణి

ఖమ్మంకార్పొరేషన్,జూన్27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో హౌస్‌కీపింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో యూనిఫాం దుస్తులను మెప్మా అధికారులు కొనుగోలు చేశారు. యూనిఫాం దుస్తులను శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తుందన్నారు. కేఎంసీ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఆర్పీ సునీత పాల్గొన్నారు.

**బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ అనిల్**

ఖమ్మం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా అనిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు.

## రాజగోపాలస్వామి భూముల
# కౌలు వేలం మళ్లీ వాయిదా



వేలం నిర్వహించేందుకు వచ్చిన అధికారులు

నేలకొండపల్లి, జూన్27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీరాజగోపాలస్వామి భూముల కౌలు వేలం మళ్లీ వాయిదా పడింది. దేవాలయ భూముల కౌలు వేలం వాయిదా పడటం ఇది మూడోసారి. రాజగోపాలస్వామి దేవాలయ 13.25ఎకరాల భూమికి సంబంధించి మూడేళ్ల కాలపరిమితికి శుక్రవారం దేవాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. పాటకు వచ్చిన రైతులు వేలంలో పాల్గొనటానికి నిరాకరించారు. గతంలో రెండుసార్లు సైతం భూముల కౌలు వేలం వాయిదా పడింది. దేవాలయ భూములు దాదాపు రెండు ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని ఆరోపిస్తూ రైతులు వేలం పాటలో పాల్గొనటానికి నిరాకరిస్తూ వస్తున్నారు. దేవాలయ భూములను సర్వే చేయించి, భూములను నికరంగా రికార్డుల ప్రకారం తేల్చిన అనంతరమే సర్వే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటికిప్పుడే సర్వే చేయించటం సాధ్యం కాదని, సర్వే అధికారులు అందుబాటులో లేరని దేవాలయ అధికారులు చెపుతూ వస్తున్నారు. శుక్రవారం వేలం నిర్వహించటానికి వచ్చిన అధికారులను రైతులు నిలదీశారు. భూమిని సర్వే చేయించిన అనంతరమే వేలం నిర్వహించాలని నిలదీశారు.

**20 రోజుల్లో సర్వే పూర్తి చేయిస్తాం**

20రోజుల్లోపు సర్వేను పూర్తి చేయించి, ఆక్రమణలున్నట్లు తేలితే స్వాధీనం చేసుకుంటామని దేవాలయ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. వేలం పాటలో పాల్గొనటానికి వచ్చిన ఎమ్మార్వై రవి మాట్లాడుతూ తహసీల్దార్‌తో మాట్లాడి సర్వేయర్‌ను పిలిపించి 10నుంచి 20 రోజుల్లో సర్వేను పూర్తి చేయిస్తామన్నారు. సర్వేను పూర్తి చేసిన అనంతరం హద్దులను నిర్ణయిస్తామన్నారు. రైతులు సహకరించాలని రవి కోరారు. కానీ రైతులు అందుకు ససేమిరా అనటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అధికారులు భూముల కౌలు వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు పోలీసులకు ఆలస్యంగా సమాచారం అందించటంతో, పోలీసులు వేలం జరిగే ప్రాంతానికి వచ్చేసరికి అధికారులు వేలం వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించటం గమనార్హం.

## మూత్రశాలలు అధ్వానం

**నగరంలోని ప్రధాన ఆస్పత్రికి సమీపంలోని మాతా శిశుసంరక్షణ కేంద్రంలోని మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. కేంద్రంలోని మొదటి, రెండో అంతస్థులో మరుగుదొడ్ల బేషన్లు పగిలిపోయి. డోర్లు ఊడిపోయి చంటిపిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మరుగుదొడ్లు ఇలా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో దోమలు పెరిగే అవకాశం ఉండడంతో సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లను బాగు చేయించాలని కోరుతున్నారు.**

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ ఖమ్మం








## 12 లోపు నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్27 (ఆంధ్రజ్యోతి): జూలై 12లోపు నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం నాలుగురోజులు హైదరాబాద్‌లో శిక్షణ అందించటం జరుగుతుందన్నారు.

## అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మంప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓమహిళ, మరో గుర్తు తెలియని పురుషుడు పదిరోజుల క్రితం మృతి చెందారు.మృతదేహాలనుఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహాల కొరకు ఎవరూ రానందున బల్లేపల్లి వైకుంఠధామంలోఅంత్యక్రియలు నిర్వహించారు.

## పలు కుటుంబాలకు కందాళ పరామర్శ

తిరుమలాయపాలెం, జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబాల సభ్యులను శుక్రవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. మేడిదపల్లిలో ఇటీవల మృతిచెందిన పెరుగు యలమంచమ్మ, రాసాల వీరయ్య, చేపల సావిత్రమ్మ, ముదిరెడ్డి నీలమ్మ, ఇందుర్తి భాగ్యమ్మ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. జల్లేపల్లిలో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన పుల్లూరి అజయ్ భౌతికకాయాన్ని పూలమాలలువేసి నివాళులర్పించారు. మేకలతండాలో మాజీ సర్పంచ్‌బోడా హైమావతి కుటుంబసభ్యులపై ఇటీవల కొంఒదరు వ్యక్తులు దాడిచేయగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న, ఉపాధ్యక్షుడు రవి, బానతు రవి, ముదిరెడ్డి లచ్చిరెడ్డి, అలుదాసు అంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మంచానాయక్ పాల్గొన్నారు.

## ఇళ్లు ఇవ్వాలని మంత్రి పొంగులేటికి వినతి

తిరుమలాయపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడం, తెట్టెలపాడు గ్రామాల్లో అర్హులైన నిరుపేదలందరికి పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణపచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పుసులూరి నరేందర్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. అలాగే మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయకరరెడ్డిని కలిసి ఆయా గ్రామాల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

## ఉచిత వైద్య శిబిరం

తిరుమలాయపాలెం,జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. అలాగే రక్తనమూనాలు సేకరించారు. ఈకార్యక్రమంలో ఏఎన్‌ఎం సీత, అనిత, నాగవాణి పాల్గొన్నారు.

## సీపీఐ ఖమ్మంరూరల్ అధ్యక్షుడిగా సుధాకర్

ఖమ్మంరూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం సీపీఐ అధ్యక్షుడిగా గూడురుపాడు గ్రామానికి చెందిన పుచ్చకాయల సుధాకర్‌ను ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, కాలంగి మోహన్‌రావు, బానోతు రాంమూర్తిను ఎన్నుకున్నారు. గురువారం నిర్వహించిన సీపీఐ 14వ మండల సభలో సీపీఐ నాయకత్వం ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అయితే పుచ్చకాయల సుధాకర్ మూడోసారి మండలాధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన కమిటికి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కూసుమంచి,జూన్2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్నట్లు క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, తిరుమలాయపాలెం మండలాల లబ్ధిదారులకు ఉదయం 11గంటలకు అందజేస్తామని చెప్పారు.

## టన్నెల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలి

కూసుమంచి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సాగర్ కాల్వకు నీరు విడుదల చేసే సమయంలో అండర్‌టన్నల్(యూటీ) నిర్మాణాన్ని చేపట్టడం సరైందికాదని సీపీఎం రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు ప్రశ్నించారు. ఈమేరకు శుక్రవారం రైతు సంఘం నాయకులు యూటీ నిర్మాణప్రాంతాన్ని సందర్శించారు. సాగర్ జలాలు నిలిపివేసి రెండు నెలలు గడుస్తున్నా.. యూటీ నిర్మాణం పూర్తిచేయలేకపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా నాయకులు బిక్కసాని గంగాధర్, చలపతిరావు, దుగ్గికృష్ణ, తుళ్లూరి నాగేశ్వరరావు, మల్లెల షన్మతిరావు, తోటకూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# తుర్కగూడెంలో పారిశుధ్య లోపం




బురదమయంగా వీధులు

- బురదమయంగా వీధులు
- పాఠశాల పక్కనే మురుగు నిల్వ
- అవస్థలు పడుతున్న గ్రామస్థులు

కూసుమంచి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో పరిపాలన గాడితప్పింది. ప్రత్యేక అధికారులు పనుల ఒత్తిడితో పట్టించుకోకపోవడంతో పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని తుర్కగూడెం గ్రామంలో పారిశుధ్యలోపం తలెత్తింది. చిన్న వర్షం వచ్చినా వీధులన్నీ చిత్తడిగామారి దుర్గంధంతో భరించలేకున్నారు. బురదరోడ్ల, అసంపూర్తి పనుల కారణంగా పారిశుధ్యలోపం తలెత్తి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో నివాసాల మధ్యనే మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెంటాడుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రాథమిక పాఠశాల పక్కనే నెలల తరబడి మురికి నీరునిల్వ ఉంటుందని, దీంతో దోమలు విజృంభిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో పరిశుభ్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అనారోగ్యం బారిన పడాల్సి వస్తోందని చెబుతున్నారు. వర్షాకాలం కారణంగా మలేరియ డెంగ్యూ కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నా... యంత్రాంగంలో కదలిక లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉంటున్నా.. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు. దోమల నివారణకు పాగింగ్ చేయడం లేదని గ్రామస్థులు తెలిపారు.ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని గ్రామానికి సీసీ రోడ్లు డ్రెయినేజీ మంజూరీ చేయాలని కోరుతున్నారు.

## డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

సత్తుపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వైద్యశాలలను సంప్రదించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.సీతారామ్ కోరారు. శుక్రవారం సత్తుపల్లిలో ఆయన రక్త పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశమయ్యారు. రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను ప్రభుత్వ అనుమతి లేకుండా పరీక్షలతో పాటు నిర్వహిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అనుమతులు ఉన్న ల్యాబ్ వద్ద ధరల పట్టిక పొందుపరచాలన్నారు.కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, హెచ్ఈవో వేణుగోపాల్, హెచ్ఈఓ దుర్గయ్య సిబ్బంది శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం



ప్రసంగిస్తున్న బిషప్

తల్లాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నదే ధ్యేయమని మేత్రాసన అమ్మంబోధివతి సగిలి ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిగూడెంలో శ్రీస్వజ్యోతి జూనియర్ కళాశాలలో ఉద్యోగమేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ మేళా నిర్వాహకుడు రెవ.ఫాదర్ జస్టిన్, ప్రిన్సిపాల్‌ఫాదర్ థామస్ పాల్గొన్నారు.

# యాసంగి భరోసా హుష్‌కాకేనా?

» పెండింగ్ సొమ్ముల కోసం రైతుల ఎదురు చూపులు

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి వానాకాలం వ్యవసాయ సీజన్‌లో కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుభరోసా డబ్బు జమచేసి రికార్డు సృష్టించింది. అయితే గత ఏడాది యాసంగికి సంబంధించిన పెండింగ్ రైతుభరోసాపై అన్నదాతల్లో ఆశలు సన్నగిల్లాయి. వానాకాలం భరోసా డబ్బులు వచ్చాయని సంతోషిస్తున్న రైతాంగం మరోవైపు యాసంగిలో భరోసా రాని రైతులు కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. యాసంగికి సంబంధించి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 62,561మంది రైతులకు రూ.178.95కోట్ల పైచిలుకు రైతుభరోసా సొమ్మును చెల్లించలేదు.

**తొలిసారి వానాకాలం సీజన్‌లో..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటిసారి వానాకాలం రైతుభరోసా సొమ్మును ఈనెల 16న ప్రారంభించి కేవలం తొమ్మిదిరోజుల వ్యవధిలోనే రాష్ట్రం మొత్తంమీద ఇప్పటివరకు రూ.8,744.13కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్రం మొత్తం మీద 1.49కోట్ల ఎకరాలకు సంబంధించి 70,11,184మంది రైతుల ఖాతాల్లో ఎకరాకు ఒక్కసీజన్ రూ.6వేల చొప్పున దాదాపు రూ.9వేల కోట్లను రైతుభరోసా కింద చెల్లించే ప్రక్రియను ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించిన విధంగా ఇప్పటివరకు రూ.8,744.13కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. సాగులో ఉన్న భూములకు వానాకాలం రైతుభరోసా చెల్లించారు. ఈ గణాంకాల్లో నాలుగెకరాల వరకు భూములున్న రైతులు 62.47లక్షలమంది ఉండగా ఆమేరకు రూ.5,215.26కోట్లను జమ చేశారు. మిగిలిన మొత్తం ఐదెకరాల పైబడినున్న భూములకు చెల్లించినట్లుగా స్పష్టమవుతుంది. ఈ గణాంకాల ప్రకారం యాసంగిలో రాష్ట్రంలో దాదాపు రూ.3,750కోట్లమేర రైతుభరోసా పెండింగ్‌లో ఉన్నట్లు స్పష్టమవుతోందని రైతులు పేర్కొంటున్నారు. యాసంగి భరోసా నాలుగెకరాల వరకే ప్రభుత్వం జమచేసింది. ఆపైన భూములున్న రైతులకు యాసంగి భరోసా అందని విషయం విదితమే. వానాకాలం భరోసా జమచేసినందున ఇక యాసంగి భరోసా పెండింగ్ డబ్బులపై ఆశలు వదులుకోవాల్సిందేనని అన్నదాతలు నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వం యాసంగి పెండింగ్‌పై ఎలాంటి ప్రకటన చేయకపోవడం పట్ల రైతులు నిరాశగా ఉన్నారు.




ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

## మిత్రుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

పెనుబల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తమతో చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబానికి పూర్వవిద్యార్థులు ఆర్థికసహాయాన్ని అందించారు. వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో 2002పదోతరగతి బ్యాచ్‌కు చెందిన గొల్ల మండల పుల్లయ్య మృతిచెందగా అతని కుటుంబానికి రూ.52వేల ఆర్థికసహాయాన్ని శుక్రవారం పూర్వవిద్యార్థులు అందజేశారు. టేకులపల్లిలోని పుల్లయ్య ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బజ్జూరి రామకృష్ణ, నంద్యాల పుల్లారావు, గోపి, హరిప్రసాద్, బండి త్రివేణి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని గన్నవరం గ్రామంలో శుక్రవారం జరిగిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సంవత్సరన్నర కాలంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించని కారణంగా నిధులు లేక గ్రామపంచాయతీలు దివాళా తీశాయని విమర్శించారు. ఈ సీజన్‌లో సెప్టెంబరు చివరి నాటికి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నందున పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆక్షేపించారు. పూర్తిస్థాయి రుణమాఫీ, రైతుభరోసా అమలు కాలేదని, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, ఆసరా పింఛన్ల పెంపు అమలుకు చేయలేదని దుయ్యబట్టారు. వీటి కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి బాజాల శ్రీనివాసరావు, నాయకులు బోడపట్ల రవీందర్, వనమా చిన్న సత్యనారాయణ, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, శీలం వెంకటరెడ్డి, పైడిపల్లి కృష్ణారావు, తుమ్మల జానీపాషయ్య, కారుమంచి జయరావు, బాజోజు రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం వైరా మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ముఖ్యంగా మునిసిపాలిటీ పరిధిలోని వార్డులకు చెందిన అర్హులైన పేదలు సీపీఎం ఆధ్వర్యంలో ఈ ధర్నా చేశారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవహరిస్తున్న ఇందిరమ్మ గ్రామకమిటీల తీరును వారు తీవ్రంగా నిరసించారు. గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇళ్లులేక అద్దెకుంటున్న వారికి కూడా ఇళ్లు ఇవ్వలేదని, ఇందిరమ్మ కమిటీల పేరుతో నాయకులు తమకు నచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేయించారని ఆరోపించారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతన్న చలపతిరావు, నాయకులు మచ్చా మణి, గుమ్మా నర్సింహారావు, కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నమహిళలు


మునిసిపల్ కమిషనర్ వేణుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


వైద్యుడు సురేష్‌కు నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

కారేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జూలై 9న దేశవ్యాప్తంగా జరుపనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైద్యులు సురేష్‌కు వినతిపత్రం అందచేశారు. మండల సీఐటీయూ నాయకులు కె.నరేందర్ ఆధ్వర్యంలో పలువురు ఆశ వర్కర్లు కలిసి ఆరోగ్యకేంద్రంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. సమ్మెలో ఆశవర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైరాద, వి.కమల, కళ్యాణి, పుష్పాలత తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ స్కీం అమలు చేయాలి

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 1999 ఫిబ్రవరి ఒకటి నుంచి 2004 ఆగస్టు 31 మధ్య ట్రాన్స్‌కో చేరిన ఉద్యోగస్తులందరికి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలుచేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఇంజనీర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఉద్యోగంలో చేరిన వారికి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ఓల్డ్ పెన్షన్ స్కీం అమలుచేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏడీఈలు ఆనంద్, కిరణ్, సంజీవ్‌కుమార్, వెంకటనారాయణ, ఏఈలు సుందర్‌కుమార్, వెంకటస్వామి, లైన్ ఇన్‌స్పెక్టర్లు నర్సిరెడ్డి, సీతయ్య, మౌలానా, అక్కిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ

కారేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు అజ్మీర నరేష్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ..ఇండ్లు మంజూరైన ప్రతి లబ్ధిదారులు త్వరగతిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోకుండా ఇంటినిర్మాణం పూర్తిచేసుకుంటే ప్రభుత్వం నుంచి వెంటనే బిల్లులు వస్తాయన్నారు. కిలారు అప్పారావు,కోటేష్ పాల్గొన్నారు.



వరిలో వెదజల్లే విధానంతో

## పెట్టుబడులు తగ్గుదల


విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు దమ్ముల్లో నేరుగా వరి విత్తనాలు చల్లుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ పేర్కొన్నారు. మండలంలోని దాచాపురం గ్రామంలో శుక్రవారం రైతులు నేరుగా వరి విత్తనాలు చల్లుకుంటున్న క్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. రైతులు చల్లుతున్న విత్తనాల గురించి ఆరా తీసి పలు సలహాలు, సూచనలు చేశారు. వరి వెదజల్లే పద్ధతి వల్ల అనేక లాభాలున్నాయని రైతులు కూలీలు, ఇతర ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. వైరా ఏవో మయాన్ మంజుఖాన్, ఏఈవో ఎస్.సైదులు, రైతులు అయిలూరి శ్రీనివాసరెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి : ఏడీఈ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ ప్రసాద్

సత్తుపల్లిరూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సత్తుపల్లి ఏడీఈ ప్రసాద్ కోరారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. అడవిరంగా విద్యుత్ సరఫరాలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కెపాసిటర్ల వాడకంపై విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆయన వెంట రూరల్ ఏఈ కావ్య, సిబ్బంది ఉన్నారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం మహిళ ఆత్మహత్యాయత్నం

» కాంగ్రెస్ నాయకుడు దూషించాడని బాధితురాలి ఆరోపణ


చికిత్స పొందుతున్న ఉషారాణి

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని గండగలపాడులో అర్హురాలైన తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదని పైగాఅప్పు కాంగ్రెస్ నాయకుడు తనను అకారణంగా దూషించాడనే మనస్తాపంతో శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఇది. గడుపు తీసిన వలురకాల ట్యాబ్లెట్లను కొనక్కల ఉషారాణి మింగి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. వివరాలిలా ఉన్నాయి. గండగలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు 64మంది అర్హులు కాగా వారిలో 30మంది లబ్ధిదారుల పేర్లను ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసి అధికారులకు పంపించింది. 30మందికిగానూ 20మంది లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లను అధికారులు కేటాయించారు. దీంతో నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాలేదు. గత 20సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటున్న ఉషారాణికి కూడా ఇల్లు మంజూరు కాలేదు. ఇదే విషయమై తమ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడిని ఉషారాణి ప్రశ్నించగా తనను అకారణంగా దూషించాడని ఆరోపిస్తూ గడుపు తీసిన ట్యాబ్లెట్లు వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆవెంటనే స్థానికులు ఆమెను హుటాహుటిన వైరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు తెలిపారు.

## పంచాయతీ కార్మికుల అరెస్టు

తల్లాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లింపుకోసం గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ బ్యాడ్జ్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఛలో హైదరాబాదు కార్యక్రమంలో పాల్గొనకుండా తల్లాడలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు అరెస్టుచేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సంఘం తల్లాడ మండల కమిటీ అధ్యక్షుడు ఎస్.హరి, నాయకులు టి.వెల్లాడి, బాలరాజు, ప్రసన్నకుమార్, నరేష్, లక్ష్మి, ధనమ్మ, సుజాత ఉన్నారు.



## కేజీబీవీని తనిఖీ చేసిన ఆర్‌జేడీ


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

ఏన్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు కేజీబీవీ విద్యాలయాన్ని శుక్రవారం విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ సంచాలకులు సత్యనారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదులను, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థినీలతో మాట్లాడారు. ఖానా అకాడమీ ప్రకారం బోధిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి నుంచే లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించడం ద్వారా జీవితం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఆర్టీసీ' రాజు అనారోగ్యంతో కన్నుమూత

**నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు**


రామ్మోహన్‌రాజు(ఫైల్)

వైరా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆర్టీసీ రాజుగా అందరికి సుపరిచితులైన సైతం రామ్మోహన్‌రాజు(75) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త అయిన రాజు వైరాలో పలు వ్యాపారాలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో కొరియర్ సర్వీస్‌తోపాటు పలు వ్యాపారాలు నిర్వహించారు. ఆయన మృతి చెందిన అనంతరం ఖమ్మం నేత్రనిధి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు.

## యువకుడి అదృశ్యం


నెలకుర్తి మనోహర్ (ఫైల్‌ఫొటో)

కల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెంగవరం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని టి మల్లవరం గ్రామానికి చెందిన ఇరువైరెండు సంవత్సరాల యువకుడైన నెలకుర్తి మనోహర్ బుధవారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఎంతకి ఇంటికి రాకపోవటంతో బాధిత యువకుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో స్థానిక ఎస్‌ఐ హరిత యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 30 వరకు రేషన్ షాపులను తెరిచే ఉంచాలి

సత్తుపల్లిరూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యం పంపిణీ నిర్వహణ చేపట్టాలని, ఈ క్రమంలో ఈనెలాఖరు వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంచాలని సివిల్ సప్లయ్ డీటీ మెట్టు వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం సివిల్ సప్లయ్ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి సత్తుపల్లి పరిధిలోని రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి రేషన్ ద్వారా సన్నబియ్యం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తనిఖీలలో డీటీలు విజయకుమార్, నాగలక్ష్మి, సత్యనారాయణ, ఆర్ఐలు కిరణ్, నరేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

## గురుకుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు(బాలుర) వైరా(బాలికల) గురుకుల విద్యాలయాల్లో 6,7,8, తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి ఆహ్వానిస్తున్నట్లు ఏన్కూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి జూలై 2వతేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 6వతేదీ ఉదయం 10గంటలనుంచి 11గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

## 90గంటల్లో 1,200 కిలోమీటర్లు..

» సైకిళ్లపై యువకుల యాత్ర

ఏన్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్‌కోసం హైదరాబాదు యువకులు చేపట్టిన 90గంటల్లో 1200కిలోమీటర్ల సాహస యాత్ర శుక్రవారం ఏన్కూరు చేరింది రాండీనియర్స్ సొసైటీ ఆధ్వర్యంలో 27మంది యువకులు శుక్రవారం హైదరాబాదు ఎల్బీనగర్ నుంచి బయలు దేరారు. ఖమ్మం, భద్రాచలం, తుని, రాజమండ్రి విజయవాడ మీదుగా గురువారంలోగా మళ్లీ హైదరాబాదు చేరుకుంటారు. రాజేష్, విజయ్, సుధాకర్, రంజిత్ ఆధ్వర్యంలో యాత్ర చేపట్టినట్టు తెలిపారు.


ఏన్కూరు చేరిన సైకిల్‌యాత్ర

## అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి

» జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్


సేవల గురించి వివరిస్తున్న శివకుమార్

పెనుబల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 108, 102 సేవలను జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ శుక్రవారం పెనుబల్లి సీహెచ్‌సీలో ప్రారంభించారు. అంబులెన్స్ వాహనంలో ఉన్న మానిటర్, వెంటిలేటర్, సిరంజ్ పంప్, ఇంకుబేటర్ గురించి ఆసుపత్రి సిబ్బందికి వివరించారు. అనంతరం నవజాత శిశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలను నివారించేందుకు నవజాతి శిశువు సంరక్షణ కేంద్రం అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అంబులెన్స్ నెంబర్ 8341800799ను ఉపయోగించుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్, అంబులెన్స్ సిబ్బంది శ్రీనివాస్, సీతారాం, రమేష్, సైదా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ ప్రవంతి, హెడ్‌నర్సు సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా వ్యవసాయ పనులు

మధిరరూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో మధిర మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొన్నటి వరకు వర్షాలు లేక వరుణుడి కోసం ఎదురుచూసిన రైతులకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు బాగా ఊరటనిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు 20రోజులు క్రితం పత్తి విత్తనాలు వేశాక వర్షాలు లేకపోవడంతో విత్తులు మొలకెత్తలేదు. రైతులు నష్టపోయారు. ఆ రైతులు మళ్లీ విత్తనాలు నాటుతున్నారు. దీంతో పెట్టుబడులు బాగా పెరుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న, పెసర వంటి పంటలు సాగుచేస్తున్నారు. మొదట పత్తి వేసి మొలిచిన కొంత మంది రైతులు పత్తి మొక్కలు కలుపుతీస్తున్నారు. పొలాల్లో రైతులు అరకలు తోలుతున్నారు. రైతులు, కూలీలతో సందడి వాతావరణం కనిపిస్తుంది.

## అధికార మార్పిడే బూర్జువా పార్టీల లక్ష్యం

ఎర్రుపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేవలం అధికార కాంక్ష తప్ప పార్టీల విధానాల్లో మార్పు రావట్లేదని, సిద్ధాంతాల పునాదుల పైనే సీపీఎం పార్టీ ప్రజాపోరాటంలో నిలబడిందని సీపీఎం పార్టీ సీనియర్ నేత మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండలస్థాయి సీపీఎం పార్టీ శిక్షణ తరగతుల్లో భాగంగా ఎర్రుపాలెం మండల కేంద్రంలో గురవిరెడ్డి ఫల్లయ్య భవనంలో ఓజురెడ్డి పార్టీశిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా అధికారం లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ సీపీఎం పార్టీ సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. బూర్జువా పార్టీలందరినమాలో అధికార దాహంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. వ్యవసాయాన్ని ప్రజల జీవితంలో ఒక భాగం చేస్తూ సామాన్యులను ఎదగనివ్వడంలేదన్నారు. డివిజన్ కమిటీసభ్యులు పాపినేని రామనరసయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు, జిల్లా కమిటీసభ్యుడు వీరయ్య, నాయకులు గామా సుజోగయ్య, సగ్గుర్తి సంజీవరావు, పెద్దవెంకటేశ్వరరావు, నల హనుమంతరావు, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు , బసవయ్య పాల్గొన్నారు.